వర్సిటీల్లో గందరగోళం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కీలక పదవుల్లోని వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ వంటి అధికారులపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. మొన్నటి దాకా వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. కొన్ని అంశాలు హైకోర్టు దాకా వెళ్ళి విచారణలు పెండింగులో వున్నాయి. ఇపుడు ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో హడావిడిగా పలువురు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరేమో పదవుల్లో కొనసాగేందుకు టీడీపీ నేతలను ఆశ్రయించే ప్రయత్నాల్లో వున్నారు. రాజీనామాలు చేయని వారిని తప్పుకోమంటూ టీడీపీ వర్గాలు ఆందోళనలకు దిగుతున్నాయి.తిరుపతి ఎస్వీయూ నుంచీ కుప్పంలోని ద్రవిడ వర్శిటీ దాకా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు నిలయంగా మారిన వర్శిటీలు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రక్షాళనకు గురవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కీలక పదవుల్లోని అధికారులపై ఆరోపణలు

వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

ప్రభుత్వం మారడంతో పలువురి రాజీనామా

పదవుల్లో కొనసాగేందుకు కొందరి యత్నాలు

తప్పుకోమంటూ ఆందోళనలకు దిగుతున్న టీడీపీ వర్గాలు

ఎస్వీయూ నుంచీ ద్రవిడ వర్శిటీ దాకా ఇదే పరిస్థితి

ద్రవిడ వర్శిటీలో ముగ్గురి రాజీనామా



కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా ప్రభుత్వం మారగానే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రార్ వేణుగోపాల రెడ్డి, రెక్టార్ అనురాధ, అకడమిక్ డీన్ శ్రీనివాసకుమార్ రాజీనామా చేశారు. అయితే రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. ఇక్కడ వీసీ మధుజ్యోతి గత డిసెంబరులో నియమితులయ్యారు. ఆమెపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వర్శిటీని గాడిలో పెట్టలేకపోయారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వర్శిటీలో పనిచేస్తున్న సుమారు 240మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఆమె బాధ్యతలు తీసుకున్నాక కూడా వేతనాలు చెల్లింపులు జరగడం లేదు. రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డిపై అనేక ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. కొన్ని కేసులు హైకోర్టులో కూడా పెండింగులో వున్నాయి. ఎవరు వీసీగా నియమితులైనా వర్శిటీలో పెత్తనం మాత్రం వేణుగోపాల్‌రెడ్డిదేనన్న ఆరోపణలున్నాయి.అసలు ఆయన నియామకమే అక్రమమని కొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణ పెండింగులో వుండగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచీ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారన్న ఫిర్యాదులూ ప్రభుత్వానికి వెళ్ళాయి. ప్రచురణల విభాగంలో 2011 నుంచీ పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి 2021లో టీచర్లుగా పదోన్నతి కల్పించడంపైనా, వారికి 2011 నుంచీ అరియర్స్ చెల్లింపులు జరపడం మీదా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. లబ్ధిదారుల్లో ఇదివరకటి చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి సన్నిహిత బంధువు వుండడంతో ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించలేదన్న ఆరోపణలున్నాయి.స్టడీ సెంటర్లు మూతపడడంతో వర్శిటీకి ఆదాయం పడిపోయిందని, చివరికి ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా డ్రా చేసి ఖర్చు పెట్టేశారని సమాచారం. ఏటా ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కూడా వర్శిటీ నిర్వహణకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం మారడంతో అక్రమాలకు పాల్పడిన అధికారులు హడావిడిగా తప్పుకునేందుకు యత్నిస్తున్నారు.

కొనసాగేందుకు వీసీ యత్నాలు

ద్రవిడ వర్శిటీ వీసీగా వున్న మధుజ్యోతి తండ్రి కొలకలూరి ఇనాక్ ప్రముఖ రచయిత, విద్యావేత్త. గతంలో ఎస్వీయూ వీసీగా కూడా పనిచేశారు.ఆయన తొలుత టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వుండి ఎస్వీయూ వీసీగా పదవి పొందారు. తర్వాత వైసీపీ వైపు మొగ్గు చూపినట్టు ప్రచారం జరిగింది. 2014లో ఆయన మరో కుమార్తె ఆశాజ్యోతి చిత్తూరు ఎంపీగా వైసీపీ టికెట్ కోసం గట్టిగా యత్నించారు. చివరి క్షణంలో అవకాశం తప్పిపోయింది. గతేడాది డిసెంబరులో మరో కుమార్తె మధుజ్యోతి ద్రవిడ వర్శిటీ వీసీగా నియమితులయ్యారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఆ వర్గ ప్రముఖుల ద్వారా మళ్ళీ టీడీపీ ప్రభుత్వ మద్దతుతో వీసీగా కొనసాగేందుకు ఆమె కుటుంబం ప్రయత్నిస్తోందని సమాచారం. అందుకే రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు రాజీనామాలు చేసినా వీసీ మధుజ్యోతి మాత్రం రాజీనామా చేయలేదని వర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్వీయూలో పరిస్థితి అస్తవ్యస్తం

ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి ఛాంబర్‌లో ఇటీవల తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి మరీ ఆయన్ను పదవి నుంచీ తప్పుకోవాలని డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. ఓ విశ్వవిద్యాలయ వీసీకి తన అధికారిక ఛాంబర్‌లో ఈ తరహా అనుభవం ఎదురు కావడం నిస్సందేహంగా అభ్యంతరకరం, అనైతికం కూడా. అయితే ఈ పరిస్థితి ఏర్పడడానికి దారి తీసిన కారణాలేమిటన్నది లోతుగా తరచి చూడాల్సి వుంది. తక్షణ కారణం ఏమిటంటే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ మద్దతుదారులు నాటి ఎస్వీయూ వీసీ రాజేంద్రప్రసాద్ ఛాంబర్‌లోకి, చివరికి ఆయన బంగ్లాలోకి కూడా చొరబడి పదవి నుంచీ తప్పుకోవాలని గొడవకు దిగారు. ఫోన్లు చేసి మరీ దుర్భాషలాడారు. దీంతో ఆయన తీవ్ర మనోవేదనతో వీసీ పదవి నుంచీ తప్పుకుని వెళ్ళిపోవాల్సి వచ్చింది. వర్శిటీ చరిత్రలో ఏనాడూ లేని ఈ



తరహా అనైతిక వర్తనను, అవాంఛనీయ సాంప్రదాయాన్ని ఐదేళ్ళ కిందట వైసీపీ వర్గీయులే ప్రారంభించారు. ఇపుడు టీడీపీ వర్గీయులు దానికి ప్రతీకారం తీర్చుకునే రీతిలో అదే తరహా నిరసనలకు దిగుతున్నారు. ఇది తక్షణ కారణమే కానీ ఎస్వీయూ పాలనా వ్యవహారాల్లో అనేక అడ్డగోలు నిర్ణయాలు జరిగాయనేది అసలైన కారణం. ప్రస్తుత వీసీ శ్రీకాంత్‌రెడ్డి గతేడాది డిసెంబరులో నియమితులయ్యారు. ఆయన పీలేరు నియోజకవర్గం కలకడ మండలానికి చెందిన పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. ఆయన కుటుంబం రాజకీయంగా అటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఇటు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కూడా సన్నిహితంగా వుంటోంది. గత డిసెంబరులో మంత్రి పెద్దిరెడ్డి సిఫారసుతోనే వీసీ పదవిలో నియమితులయ్యారు. అప్పటి నుంచీ మంత్రి సిఫారసుతో సుమారు వంద దాకా తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేశారన్న ఆరోపణలున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్ల ఉద్యోగ కాలపరిమితిని 89 రోజుల నుంచీ 11 నెలలకు పొడిగించడం కూడా వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా మునుపటి తేదీ వేసి 13మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈనెల 4న ఓట్ల లెక్కింపు ఫలితాల్లో టీడీపీ అధికారంలోకి రావడం స్పష్టం కాగానే ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ అదే రోజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మూడేళ్ళ కిందట అప్పటి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సిఫారసుతో రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి కూడా తప్పుకుంటారని టీడీపీ వర్గీయులు భావించారు. అయితే శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి మాజీ సీఎం నల్లారి కిరణ్, ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌లతో సన్నిహిత సంబంధాలున్న కారణంగా వారి సిఫారసుతో పదవిలో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే టీడీపీ వర్గీయులు గట్టిగా పట్టుబడుతున్నా, చివరికి ఛాంబర్‌లోకి వెళ్ళి బైఠాయించి మరీ నిరసనలు వ్యక్తం చేస్తున్నా వీసీ స్పందించడం లేదని సమాచారం.

వెటర్నరీ వర్శిటీలో కోడ్ ఉల్లంఘనలు



తిరుపతిలోని వెటర్నరీ వర్శిటీలో ఎన్నికల కోడ్ అమల్లో వుండగానే ఉల్లంఘించి మరీ నియామకం జరిగింది.డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి పోస్టు ఖాళీ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరు వెటర్నరీ కాలేజీకి చెందిన పేథాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా వున్న ప్రొఫెసర్ శ్రీలతను నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక జరిగిన ఈ నియామకం వాస్తవానికి ఏపీ సీఈవో నుంచీ అనుమతి తీసుకున్నాక చేపట్టాల్సి వుంది. అయితే సీఈవో లేదా ఈసీ అనుమతి లేకుండానే రిజిస్ట్రార్ తాత్కాలిక ప్రాతిపదికన నియామకం జరిపారు.తాత్కాలిక నియామకమైనా ఈసీ ముందస్తు అనుమతి తప్పనిసరి. వర్శిటీ పాలకవర్గం అనుమతి కూడా లేదు. దానికి తోడు తాత్కాలిక నియామకం కాల పరిమితి మూడు నెలలు మాత్రమే. అయితే ఏకంగా ఆరు నెలల కాలపరిమితితో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం ఏమవుతుందోనని, కోడ్ ఉల్లంఘించి నియామకం జరిపిన అధికారులపై ఎలాంటి చర్యలు వుంటాయోనన్న చర్చ వర్శిటీలో జోరుగా నడుస్తోంది.

మహిళా వర్శిటీలో వీసీ కొనసాగే అవకాశం



పద్మావతీ మహిళా వర్శిటీ వీసీ భారతి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరోపణలు లేకపోవడానికి తోడు బలిజ సామాజికవర్గానికి చెందిన ఈమెకు ఆ సామాజిక వర్గం అండదండలు లభించే పరిస్థితి నెలకొంది. సౌమ్యురాలుగా, వివాద రహితురాలుగా పేరుండడంతో కొనసాగింపు సమస్య కాబోదని సమాచారం. రిజిస్ట్రార్ రజని మాత్రం కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.



రుయాస్పత్రిలోని వసతులపై పేషెంటుతో మాట్లాడుతున్న సత్యకుమార్

ప్రభుత్వాస్పత్రుల్లో వసతుల కల్పనకు పెద్దపీట

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 17 : నిరుపేదలకు కార్పొరేటు స్థాయి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు.తిరుపతిలోని రుయాస్పత్రిని ఆయన సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. అత్యవసర విభాగంలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాక వివరాలను సూపరింటెండెంట్ రవిప్రభును అడిగి తెలుసుకున్నారు.ఓపీ కేంద్రానికి వెళ్లి క్యూలో వున్న రోగులతో మాట్లాడి ఓపీ స్లిప్పులను పరిశీలించారు. మెడిసిన్ వార్డులో రోగులతో పాటు వారి సహాయకులతో కూడా మాట్లాడారు.వార్డుల్లో నీటి సమస్య వుందని రోగులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రేడియాలజీ విభాగంలో సరైన వసతులు లేకపోవడాన్ని గుర్తించి మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులతో ఆస్పత్రి పరిస్థితిపై సమీక్షించారు.గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ సేవలను అందించాలని కొంత మంది వైద్యులనే నియమించిందని, వైద్య పరికరాలు, గదుల కొరత ఉందని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ రవిప్రభ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వీలైనంత త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి హామీ ఇచ్చారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్బారావు, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి,సామంచి శ్రీనివాస్ , శ్రీహరిరావు, సుబ్రహ్మణ్య యాదవ్, చిట్టిబాబు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సెలవు పొడిగించండి

సీఎస్‌కు ధర్మారెడ్డి అభ్యర్థన

తిరుమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరు వరకు తనకు సెలవు పొడిగించాలని టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు లేఖ పంపారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడులైన రెండు రోజుల తరువాత ధర్మారెడ్డి తనకు సెలవు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం తిరుమల పర్యటనకు ముందు 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రాష్ట్రప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన ఈవోగా శ్యామలరావును నియమించింది.ఈవో బాధ్యతలను ఆయనకు అప్పగించిన ధర్మారెడ్డి తనకు 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లీవ్ కావాలంటూ సీఎస్‌కు లేఖలో విన్నవించుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన పదవీవిరమణ చేయబోతున్న విషయం తెలిసిందే.

3.10లక్షలమంది 'పీఎం కిసాన్' లబ్ధిదారులకు నేడు నగదు జమ

తిరుపతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏటా రైతులకు మూడు సార్లు అందించే ఆర్థికసాయం మంగళవారం రెండవసారి అందనుంది.చిత్తూరు జిల్లాలో 1.75లక్షలమంది రైతులకు రూ.35కోట్లు, తిరుపతి జిల్లాలో 1.35లక్షలమంది రైతులకు 27.08కోట్లు ఖరీఫ్ పెట్టుబడి సాయం వారివారి బ్యాంకు ఖాతాల్లో జమకానుంది.

కిలో టమోటా రూ.56.70

పుంగనూరు, జూన్ 17 : చిత్తూరు జిల్లా పుంగనూరు మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.56.70 పలికింది. ముస్లింల పర్వదినం బక్రీద్ సందర్భంగా డిమాండు పెరిగింది. దీంతో ఆదివారం కిలో టమోటా ధర రూ.49.40 ఉండగా.. సోమవారానికి రూ.56.70కి చేరింది. రెండో రకం కిలో రూ. 53.40, మూడో రకం రూ.48 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలుచేశారు. పుంగనూరు మార్కెట్‌కు రైతులు 340.99 టన్నుల టమోటాలు తీసుకొచ్చారు.









తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఎదురుగా,ఎయిర్ బైపాస్ రోడ్డులో, ఎమ్మార్ పల్లి పంచాయతీ ఆఫీసు పక్కన,ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన అన్న క్యాంటీన్ భవనాల్లో వెలసిన హోటళ్లు

మూడు నెలల్లో అన్న క్యాంటీన్లు

పునఃప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

తిరుపతిలో వైసీపీ నేతల చేతుల్లో క్యాంటీన్ల భవనాలు

వాటిలో ఖరీదైన హోటళ్లు, కేఫ్‌లు ఏర్పాటు

తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అన్నార్తుల కడుపు నింపే అన్నా క్యాంటీన్లు మళ్లీ ప్రారంభం కానున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018నుంచి దశలవారీగా జిల్లాలో పది చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతూ వచ్చారు. పేదలు, చిరుద్యోగులు, అసంఘటిత కార్మికులకు ఆసరాగా నిలిచిన అన్న క్యాంటీన్లు వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే మూతపడ్డాయి. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చిన గడువు పూర్తయిందని, మళ్లీ ప్రారంభిస్తామని ప్రభుత్వ పెద్దలు కథలు చెప్పారు. అన్న కాంటీన్ల భవనాలకున్న పసుపు రంగును మార్చి తెలుపు రంగు వేశారు. 'అన్న' పేరును తీసేశారు. ప్రజల మన్ననలు పొందిన ఈ పథకాన్ని నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వినిపించినా ప్రభుత్వం పట్టించుకోలేదు.మళ్లీ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణకు యంత్రాంగం సిద్ధమైంది.సెప్టెంబరు 21లోపు జిల్లావ్యాప్తంగా ఉన్న 10 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు సంబంధించి ఆయా మున్సిపాల్టీల కమిషనర్లతో పాటు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు చర్యలు తీసుకోవాల్సివుంటుంది. క్షేత్రస్థాయిలోని అన్న క్యాంటీన్ల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, వాటిని వినియోగంలోకి తెచ్చుకునే దిశగా కసరత్తు జరగనుంది.

ఖరీదైన హోటళ్లుగా మారిన క్యాంటీన్లు

జిల్లాలో దాదాపు 10 అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయగా తిరుపతిలోనే 4 ప్రారంభించారు. స్విమ్స్ సర్కిల్లో ఒకటి, ఎమ్మార్ సర్కిల్ సమీపంలో రెండు, ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట మరొక క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటైన అన్న క్యాంటీన్లపై నేతల కన్ను పడింది. అన్న క్యాంటీన్లను అద్దెకు ఇవ్వాలని కౌన్సిల్లో తీర్మానం చేసి అనుచరులకు కట్టబెట్టేశారు. నామమాత్రపు అద్దెతో అవన్నీ ఖరీదైన హోటళ్లుగా మారిపోయాయి. తిరుపతిలో వైసీపీ యువనేత ఆదేశాల మేరకు ఏ ప్రాంతంలో ఉండే అన్న క్యాంటీన్లను ఆయా ప్రాంతాల్లోని వైసీపీ నేతలకు కట్టబెట్టేశారు.

- పలు చోట్ల సచివాలయాలుగా

పలు చోట్ల ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు సచివాలయాలు, హెల్త్‌క్లినిక్‌లుగా మారాయి. శ్రీకాళహస్తిలోని రెండు అన్న క్యాంటీన్లలో ఒకటి సచివాలయంగా, మరొకటి ప్రెస్‌క్లబ్‌గా మారింది. గూడూరులోని అన్న క్యాంటీన్ సచివాలయంగా కొనసాగుతోంది. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద క్యాంటీన్ భవనంలో సచివాలయ సేవలందుతున్నాయి. సూళ్లూరుపేటలోని అన్న క్యాంటీన్ పట్టణ ఆరోగ్య కేంద్రంగా మారింది. వెంకటగిరిలోని అన్న క్యాంటీన్‌ను సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వినియోగిస్తూ వచ్చారు. గత శనివారం ఎమ్మెల్యే రామకృష్ణ మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు.ఇప్పటివరకూ ప్రజా విజ్ఞప్తుల కోసం వినియోగిస్తూ వస్తున్న ఈ భవనంలోని కుర్చీలు, టేబుల్ తొలగించారు. అన్నక్యాంటీన్ నిర్వహణకు అనుకూలంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పాలకమండలి రాజీనామా


రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవోకి అందజేస్తున్న చైర్మన్, పాలకమండలి సభ్యులు

చంద్రగిరి, జూన్ 17: చంద్రగిరిలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిల సహకారంతో, భక్తుల దాతృత్వంతో ఆలయ పునర్నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. భక్తుల విరాళం, టీటీడీ నిధులు కలిపి రూ.5 కోట్లు వచ్చాయన్నారు. దేవదాయశాఖకు రూ.30 లక్షలు చెల్లించగా, రూ.1.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆలయం గోపురంపైన బంగారు కలశం కోసం రూ.10 లక్షలతో సిద్ధం చేశామన్నారు. సుమారు రూ.2 కోట్ల మేర తుడా వ్యయంతో ఆలయ ఆవరణలో బాలాలయం, అన్నదాన మండపం, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ఆలయం నుంచి పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానికి సత్కారం


నానితో విజయశేఖర్ దంపతులు

భాకరాపేట, జూన్ 17: ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానిని ఆయన గృహంలో చిన్నగొట్టిగల్లు ఎంపీటీసీ విజయ శేఖర్ గౌడ్ దంపతులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు పురుషోత్తమ నాయుడు, కిశోర్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

సున్నపు కుండల వేషంలో మిట్టమీదగంగమ్మ దర్శనం


సున్నపు కుండల వేషధారణలో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

చంద్రగిరి, జూన్ 17: మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం అమ్మవారు సున్నపు కుండల వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేసి, సున్నపు కుండల అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. సున్నపు కుండలతో అమ్మవారి వేషదారణలో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన ఎల్లమ్మ ఆలయం సమీపంలోని గ్రామ పొలిమేరలోని పోలేరమ్మకు గంగమ్మ జాతరకు ఆహ్వానం పలుకుతూ సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, చంద్రగిరి ప్రజలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా


చంద్రగిరిలో గ్రావెల్ ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్న దృశ్యం

చంద్రగిరి, జూన్ 17: చంద్రగిరి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ నుంచి గ్రావెల్‌ను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు, సెబ్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం బక్రీద్ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఇదే అదునుగా ఇందిరమ్మ కాలనీ గుట్టలో జేసీబీ సాయంతో గ్రావెల్‌ను సుమారు వంద ట్రిప్పులు తరలించారు.కాలనీ వాసులు సమాచారం అందించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వాపోతున్నారు. రోడ్లపై గ్రావెల్, ఇసుక తరలిస్తుంటే సాధారణంగా పోలీసులు, సెబ్ పోలీసులు సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తుంటారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేరుశనగ సబ్సిడీ విత్తనాలకు నిరీక్షణ


కాలేపల్లిలో వేరుశనగ విత్తనం వేస్తున్నరైతులు

రామచంద్రాపురం, జూన్ 17: బలిజపల్లి, బాదూరు, సీకేపల్లి ప్రాంతాల్లో సోమవారం వేరుశనగ విత్తడం పనులు జోరందుకున్నాయి. నెలరోజుల్లో పలుదఫాలుగా వర్షాలు కురుస్తుండటంతో దుక్కులు దున్ని విత్తడానికి పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయకపోవడంతో రైతులు శ్రీకాళహస్తి ప్రాంతానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఇక్కడ పండిన పంట విత్తడానికి పనికి రాకపోవడంతో బస్తా రూ.3వేల నుంచి రూ.3,200 వరకు వెచ్చించి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం వేరుశనగ విత్తడానికి సరైన సీజన్ కావడంతో సబ్సిడీపై విత్తనాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేల పరస్పర శుభాకాంక్షలు



తిరుపతి రూరల్, జూన్ 17: ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ సోమవారం పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తో భేటీ అయ్యారు. అమరనాథ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కూడా వారిద్దరినీ అభినందించారు. చంద్రబాబు సొంత నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలుపొందిన నానీని ప్రత్యేకంగా అభినందించారు. బలమైన ప్రత్యర్థిపై గెలుపుకోసం ప్రాణాలను పణంగా పెట్టి కుటుంబసభ్యులందరూ కలసి పోరాటం చేశారని ప్రశంసించారు.

శ్రీవారికి ఉయ్యాల బల్ల బహూకరణ



వడమాలపేట, జూన్ 17: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామికి తిరుపతికి చెందిన హేమంత్ ఉయ్యాల బల్ల బహూకరించారు. స్వామివారి ఊంజలసేవ, ఏకాంతసేవలో ఉపయోగించేందుకు నాలుగు కిలోల వెండితో చేసిన ఉయ్యాల బల్లను ఆలయ అధికారులకు సోమవారం అందజేశారు.

ఆర్‌సీపురంలో మోస్తరు వర్షం

రామచంద్రాపురం, జూన్ 17: సీకేపల్లి, రాయలచెరువుపేట, బాదూరు, కమ్మపల్లి ప్రాంతాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో వరి ఈడ్పులకు అంతరాయం ఏర్పడింది. ఇది వరకే పొలాల్లో ఉన్న వరి తడిసి ముద్దయింది. అయితే చెరకు తోటలకు మేలు చేకూరింది. నెల రోజులుగా పలు దఫాలుగా వర్షం కురవడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

నేడు కేజీబీవీ స్కూల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ

ఎర్రావారిపాలెం, జూన్ 17 ; ఎమ్మెల్యే పులివర్తి నాని తన అధికారిక కార్యక్రమాన్ని ఎర్రావారిపాలెం మండలం నుంచి ప్రారంభించనున్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ,మోడల్ స్కూల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం,బ్యాగులు విద్యార్థులకు అందజేయనున్నారు.



వైభవంగా పద్మావతిదేవి తెప్పోత్సవాలు ప్రారంభం

● పలు ఆర్జిత సేవల రద్దు


పద్మసరోవరంలో విహరిస్తున్న ఉభయదేవేరులతో స్వామివారు

తిరుచానూరు, జూన్ 17: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి పద్మసరోవరంలో తెప్పలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం కేటీ మండపంలో ఉత్సవర్లకు అభిషేకాలు జరిగాయి. సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామిని అమ్మవారి పుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పలపై కొలువుతీర్చారు. ఉభయదేవేరిలతో స్వామివారు పద్మసరోవరంలో మూడు చుట్టు విహరించి భక్తులను కటాక్షించారు. రాత్రి ఉత్సవర్లు మాడవీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాల నేపథ్యంలో పలు ఆర్జిత సేవలను రద్దుచేశారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



భాకరాపేట, చంద్రగిరి ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుక

భాకరాపేట, జూన్ 17: బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలోని అన్ని మసీదుల్లో ప్రార్థనలు చేశారు. ఉదయం ఈద్గా మైదానంలో ప్రార్థన నిర్వహించారు. మత గురువులు మహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపించారు. ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణ చేశారు. ముతవల్లి షాజహాన్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి: చంద్రగిరిలోని ఆర్‌ఎఫ్ రోడ్డులోని ఈద్గా మైదానంలో హజ్రత్ హఫీజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజ్రత్ అలీం కాలేషా మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకొంటూ బక్రీద్ పండుగను జరుపుకొంటున్నామన్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

పదోన్నతి పొందిన పోలీసులకు అభినందనలు


పదోన్నతి పొందిన సిబ్బందికి అభినందనలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: జిల్లాలో హెడ్ కానిస్టేబుళ్ళుగా పదోన్నతి పొందిన పోలీసు సిబ్బందిని సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారు. ఆయన మాట్లాడుతూ పెరిగిన బాధ్యతలను గుర్తెరిగి పని చేసి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. ఆరుగురికి స్టేషన్లు కేటాయించారు.

మంత్రి ఆనంకు సత్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 17: దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామనారాయణ రెడ్డిని తెలుగు యువత నాయకులు సత్కరించారు. తిరుపతికి చెందిన తెలుగు యువత నాయకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు విజయవాడకు వెళ్ళి సోమవారం సత్కరించారు. .

మంత్రి సంధ్యారాణికి టీఎస్ఎఫ్ సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 17 : గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడి సంధ్యారాణిని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) సన్మానించింది. టీఎస్ఎఫ్ జాతీ య అధ్యక్షులు కరంశి అక్కులప్ప నాయక్ తదితరులు సోమవారం విజయవాడకు వెళ్ళి మంత్రి సంధ్యారాణిని సన్మానించారు. గిరిజన విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు విష్ణునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాయక్, రఘునాథ్, మల్లేష్‌నాయక్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హామీలను ఏడాదిలో పూర్తిచేస్తా : నాని


ఎమ్మెల్యే పులివర్తి నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

మంగళం, జూన్ 17: మంగళం ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాదిలోగా పూర్తిచేస్తానని ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నాని చెప్పారు. సోమవారం మంగళం ప్రాంతానికి వచ్చారు. సోమవారం బక్రీద్ సందర్భంగా రణధీరపురం పంచాయతీ పరిధిలోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. స్థానిక ముస్లింలు పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని నాని హామీ ఇచ్చారు. మంగళం పంచాయతీ బీటీఆర్‌పురంలో కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకుడు పరశురామ్ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. నాయకులు అలిమినేని మధు, శ్రీధర్, ఈశ్వరయ్య, గోపీనాథ్, మంగళం పరిధిలోని పంచాయతీ అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు లాక్కున్న యువకులు


నిందితులు వదిలేసిన ద్విచక్ర వాహనం

పాకాల, జూన్ 17: మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన సంఘటన కెవడ్డేపల్లె పంచాయతీ అమ్మగారిపల్లె బస్‌స్టాప్ వద్ద సోమవారం జరిగింది. పాకాల వారపుసంతకు వెళ్లాలని అమ్మగారిపల్లె ఆర్చివద్ద బస్సు కోసం ఎ.మంజుల అనే మహిళ వేచి వుంది. ఈ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆమె మెడలోని 32 గ్రాముల బంగారు చైను, 8 గ్రాముల బంగారు మంగళ సూత్రం లాక్కొని నేండ్రగుంటవైపు వెళ్లారు. మహిళ కేకలు వేయడంతో కొందరు వీరిని వెంబడించారు. దీంతో నేండ్రగుంట సమీపంలో మోటారు సైకిల్ వదిలేసి సమీప అడవిలోకి పారిపోయారు. బాధితురాలు పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగన్ మొసలి కన్నీరు ప్రజలు నమ్మరు

● మాజీ మంత్రి సి.రామచంద్రయ్య



తిరుపతి(వైద్యం), జూన్ 17 : పవిత్రమైన టీటీడీని వైసీపీ పాలనలో ఆదాయం తెచ్చిపెట్టే వ్యాపార కేంద్రంగా మార్చేశారని మాజీ మంత్రి సి.రామచంద్రయ్య విమర్శించారు.సామాన్య భక్తులకు స్వామి దర్శనం దూరం చేశారన్నారు.వైసీపీ పాలనలో దోపిడీలకు సంబంధించిన ఐదు పేజీల బుక్‌లెట్‌ను సోమవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు.అక్రమ గెస్ట్‌హౌస్‌లు, అక్రమ టికెట్ల దందా, నాసిరకం నైవేద్యం, అద్దె గదుల ధరల పెంపు ఇలా చాలా అక్రమాలు జరిగాయన్నారు. ఆలీబాబా 40 దొంగల మాదిరిగా దోచుకుతిన్నారన్నారు.జగన్ అండ్ కో చేసిన దోపిడీలను బహిర్గతం చేసి కారకులను శ్రీకృష్ణజన్మస్థానానికి పంపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జగన్ చేసిన పాపాలను ప్రజల ముందు అంగీకరించాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలను లెక్కచేయకపోవడం, తాను అనుకున్నదే చెల్లుబాటు కావాలనుకోవడం, ప్రజలపై విపరీత ఆర్థిక భారాలు మోపడం, ఎవరి సలహాలు, సూచనలు పాటించకపోవడం, ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేయడం వంటి లక్షణాలు జగన్‌లో పరిపూర్ణంగా వున్నాయని విమర్శించారు. అందుకే జగన్ ప్రజాజీవితంలో ఉండదగిన వ్యక్తికాదని, అతనొక అరాచకవాది అన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుగంగ కాలనీ అతిథిగృహంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షనర్స్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రెడ్డివాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మంజు, కార్యదర్శిగా భారతి, ఆర్థిక కార్యదర్శిగా ఇందిరను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యువకిషోర్, ఎస్.బాషా, చెంగల్‌రాయులు, వెంకటయ్య, బాలచందర్, లక్ష్మీపతి, విశ్వనాథ్, సరిత పాల్గొన్నారు.

దర్యాప్తులో అలసత్వం వహిస్తే చర్యలు

●ఎస్పీ హర్షవర్ధన రాజు


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: జిల్లాలో కొన్నేళ్ళుగా జరిగిన గ్రేవ్ కేసుల దర్యాప్తులో అలసత్వం, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు. ఈ కేసుల దర్యాప్తు వెనుకబడి వుండడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతిలోని పోలీసు కమాండ్ కంట్రోలు హాలులో సోమవారం గ్రేవ్ కేసుల పురోగతిపై ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా అరెస్టు, పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. కేసులను నిష్పక్షపాతంగా, దర్యాప్తు చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. సబ్ డివిజన్ల వారీగా పెండింగ్ కేసులపై సమీక్షించి పనితీరును పరిశీలించారు. దర్యాప్తులో వెనుకబడిన సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నేర పరిశోధన పకడ్బందీగా చేయాలన్నారు. తద్వారా ఖచ్చితమైన ఆధారాలు లభిస్తాయన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, డీఎస్పీలు వెంకటాద్రి, రవిమనోహరాచ్చారి, రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్పైస్‌జెట్ సిబ్బందితో ప్రయాణికుల గొడవ

రేణిగుంట, జూన్ 17:తిరుపతి విమానాశ్రయంలో స్పైస్‌జెట్ సిబ్బందితో ప్రయాణికులు గొడవకు దిగారు.స్పైస్‌జెట్ విమానం రాత్రి 7.15గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని తిరిగి 8.05గంటలకు హైదరాబాద్ వెళుతుంది. సోమవారం ఈ విమానానికి 78 మంది ప్రయాణికులు రేణిగుంట నుంచి హైదరాబాద్‌కు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే రాత్రి 11.30 గంటలకు ఆలస్యంగా విమానం వస్తుందని ప్రయాణికులకు సోమవారం మధ్యాహ్నం సమాచారం ఇచ్చారు. దీంతో కొంతమంది ప్రయాణాన్ని రద్దు చేసుకోగా మరికొంతమంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. తిరిగి సాయంత్రం 4గంటలకు విమానం క్యాన్సిల్ అయిందంటూ సమాచారాన్ని మెసేజ్ రూపంలో పంపించారు. అయితే అప్పటికే విమానాశ్రయానికి చేరుకున్న ఆరుగురు ప్రయాణికులు స్పైస్‌జెట్ సిబ్బందితో గొడవకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఇంతలో కొంతమంది కలుగజేసుకుని సర్దిచెప్పడంతో ప్రయాణికులు తిట్టుకుంటూ వెనుదిరిగారు.

నాడు పగ... నేడు పనులు

మూడేళ్ల తర్వాత శ్రీనివాసం ఎదురు రోడ్డుకు మోక్షం


రోడ్డునిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పగబట్టి రోడ్డు లేకుండా చేసింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చీరాగానే ప్రజల పక్షాన నిలిచి రోడ్డు ఏర్పాటు పనులను ప్రారంభించింది. శ్రీనివాసం ఎదురుగా యూడీఎస్ పేరుతో అడ్డంగా తవ్వేసిన రోడ్డుపై స్థానికుల మూడేళ్ల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 2019 ఎన్నికల్లో పెద్దకాపులే అవుట్ వాసులు తమకు ఓట్లు వేయలేదని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి కక్ష పెంచుకుంది. పదుల సంఖ్యలో ఉన్న హోటళ్లకు, దాదాపు ఐదువేల ఇళ్లున్న ప్రాంతానికి దారిలేకుండా చేశారు. ఆటోలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు వేయమని స్థానికులు అప్పటి అధికార పార్టీ ముఖ్య నేతలను కలిసి విన్నవిస్తే పెద్దమొత్తాన్ని డిమాండు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అంత ఇచ్చుకోలేక అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. 'పెద్ద కాపువీధిపై అంత పగెందుకు?' అంటూ ఆంధ్రజ్యోతిలో కథనాలు కూడా వచ్చాయి. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, 11వ డివిజన్ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి కంకణాల రజనీకాంత్ నాయుడు, స్థానిక మాజీ కౌన్సిలర్ ఈతమాకుల హేమంత్ యాదవ్, బీజేపీ నేత సామంచి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పులుగోరు మురళీ కృష్ణారెడ్డి తదితరులతో పాటు స్థానికులు పెద్దఎత్తున ఉద్యమాలు చేశారు. అధికారం మార్పు జరిగిన తర్వాత గానీ అక్కడివారికి న్యాయం జరగలేదు. సోమవారం రోడ్డునిర్మాణ పనుల భూమిపూజతో మూడేళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.

● కక్ష రాజకీయాలు చేయం
ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

టీడీపీకి ఓట్లు వేస్తారన్న కారణంగా పెదకాపు లేఅవుట్‌వాసులపై మాజీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి కక్ష కట్టి పెద్దకాపు లేవుట్‌కు సర్వీస్ రోడ్డు వేయకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. మేయర్ శిరీష, స్థానిక వైసీపీ కార్పొరేటర్ ప్రవళ్లికా రెడ్డిలతో కలసి సోమవారం ఉదయం రోడ్డునిర్మాణ పనులకు భూమిపూజ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్వర్టు పూర్తి చేయకుండా స్థానికులను, వ్యాపారవర్గాలను కరుణాకరరెడ్డి ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలు తిరుపతిలో ఇకపై చెల్లవన్నారు. అభివృద్ధే తమ అజెండా అని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహయాదవ్, కూటమి పార్టీల నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, జేబీ శ్రీనివాస్,కంకణాల రజనీకాంత్ నాయుడు, పొలకల మల్లిఖార్జున్, నవీన్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి, ఊకా విజయ్ కుమార్, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, మాజీ కౌన్సిలర్ యాలమూరి శ్రీనివాసుల రెడ్డి, చిన బాబు, మహేష్ యాదవ్, భరణి యాదవ్, హేమంత్ కుమార్, సింగంశెట్టి సుబ్బరాయులు, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, హేమకుమార్, సాయి కుమార్, కమల్ నాయుడు, జనార్దన్, గుత్తా శరత్ చౌదరి, మున్సిపల్ ఎస్ఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

నాలుగు అన్న క్యాంటీన్లు త్వరలో పునఃప్రారంభం



అన్న క్యాంటీన్ ఏర్పాటుపై పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, టీడీపీ నాయకులు

తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగు అన్నక్యాంటీన్లను త్వరలోనే పునఃపారంభిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ క్యాంటీన్లను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని వ్యాపారం చేస్తూ పేదల పొట్ట కొట్టారని ఆయన విమర్శించారు. స్విమ్స్ ఎదురుగా అన్న క్యాంటీన్‌ను ఎన్డీఏ నేతలతో కలసి ఆయన సోమవారం పరిశీలించారు. క్యాంటిన్ స్థలంలో ప్రైవేట్ హోటల్ నిర్వహిస్తుండటమే కాకుండా నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ స్థలాన్ని కబ్జా చేసి హోటల్ నడపడాన్ని గుర్తించారు. వెంటనే ఖాళీ చేయాలని లేకుంటే అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. పేదలకు నాణ్యమైన ఆహారం తక్కువ ధరకు అన్న క్యాంటీన్ల ద్వారా అందించిన ఘనత చంద్రబాబు నాయుడుదని ఆయన తెలిపారు. వైసీపీ ఐదేళ్ళలో పేదల పొట్ట కొట్టిందని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ పేదలకు వ్యతిరేకంగా జగన్ అన్న క్యాంటీన్లను మూసేశారని విమర్శించారు. నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, పొలకల మల్లిఖార్జున్, మహేష్ యాదవ్, రాజారెడ్డి, భరణి యాదవ్, సింగంశెట్టి సుబ్బరాయులు, మన్నెం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తగ్గుతున్న భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): గత మూడురోజులతో పోలిస్తే తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టింది. 15, 16, 17వ తేదీ వరకు వరుస సెలవులు కావడంతో శని, ఆదివారాలు తిరుమల క్షేత్రం భారీ భక్తుల సంఖ్యతో కిక్కిరిసిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి పనిరోజులు మొదలు కానున్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో ఉన్న భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అక్టోపస్ భవనం వరకు ఉన్న క్యూలైన్ బాటగంగమ్మ ఆలయం వరకు తగ్గింది. 36 గంటలు ఉన్న దర్శన సమయం 24 గంటలకు తగ్గింది. మంగళవారం ఉదయానికి రద్దీ మరింత తగ్గే అవకాశాలున్నాయి.

హుండీ ఆదాయం రూ.4 కోట్లు: శ్రీవారి హుండీ ఆదాయం రూ.4 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదివారం 69,870 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 42,119 మంది తలనీలాలు సమర్పించారు.

తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు

● తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మంచి సంబంధాలు ఉండాలని, తెలుగుజాతి సంతోషంగా ఉండాలని స్వామిని కోరుకున్నట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సతీమణి పద్మావతి పుట్టినరోజు సందర్భంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నామన్నారు. తిరుపతికి ఎప్పుడు వచ్చినా సంతోషంగా ఉంటుందన్నారు. ఏపీలో కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

ఘాట్‌రోడ్డులో అదుపు తప్పిన కారు

● ముగురికి స్వల్పగాయాలు



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో సోమవారం ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. మహారాష్ట్రకు చెందిన ఓ కుటుంబ శ్రీవారి దర్శనం ముగించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎలిఫెంట్ ఆర్చ్ దాటాక కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. కుడి వైపు దూసుకుపోయింది. చెట్టును ఢీకొని నిలిచిపోయింది. కారులోని ముగ్గురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

తిరుమల కాటేజీలో కట్లపాము



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల కాటేజీలో కట్లపాము భక్తులను భయాందోళనకు గురిచేసింది. సోమవారం శ్రీవారిమెట్టుకు చివరిభాగంలోని టీబీసీ 50వ నెంబరు గల గది కిటికీకి ప్రమాదకరమైన పాము చుట్టుకుని ఉండటాన్ని భక్తులు గుర్తించారు. భయంతో బయటకు వచ్చి సమీపంలోని అధికారులకు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ రేంజర్ శివకోటి తన బృందంతో వెళ్లి పామును పట్టుకున్నారు. అనంతరం దట్టమైన అడవిలో విడిచి పెట్టారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు





అజిత్ - లగడపాటి రాజగోపాల్

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంఎల్సీ రామచంద్రయ్య, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, తెలంగాణ ఎంఎల్సీ భానుప్రసాద్ రావు, మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

సుప్రభాతసేవలో హీరో అజిత్: తమిళ హీరో అజిత్ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో పాల్గొన్న ఆయన అనంతరం గర్భాలయంలోకి వెళ్లి మూలమూర్తిని దర్శించుకున్నారు. అజిత్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

మంత్రి సత్యకుమార్‌కి తిప్పారెడ్డి అభినందన



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, జూన్ 17: ఆరోగ్య, వైద్యవిద్య, కుటుంబ సంక్షేమ శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్‌ని అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం తిప్పారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన పూర్వవిద్యార్థి సత్యకుమార్‌యాదవ్ అనతికాలంలోనే రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి ఎదగడంతోపాటు ఏపీరాష్ట్ర వైద్యవిద్యాశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీజేపీ నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బలిజ సేన అధ్యక్షుడిగా నీలాద్రి



తిరుపతి అర్బన్, జూన్ 17: జిల్లా బలిజసేన అధ్యక్షులుగా చెరుకుల నీలాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

కూటమి నేతలతో మేయరమ్మ

పోలింగ్ దాకా భూమన కరుణాకరరెడ్డి వెన్నంటి తిరిగిన తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష సోమవారం నాడు తిరుపతి ఎమ్మెల్యే, కూటమి నేతలతో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొనడం నగరంలో చర్చగా మారింది. శ్రీనివాసం ఎదురుగా జరిగిన రోడ్డు నిర్మాణ పనుల పూజా కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆమె పాల్గొన్నారు. పెదకాపు లేఅవుట్ ప్రజలను తీవ్ర ఇక్కట్లకు గురిచేసేలా వైసీపీ ముఖ్య నేత కక్షగట్టి తవ్వేశారంటూ ఆరోపణలు వచ్చిన చోట రోడ్డు నిర్మాణానికి జరిగిన భూమిపూజలో మేయర్ శిరీష పాల్గొనడం విశేషం. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మేయర్ పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్ వంటివారు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ మేయర్‌కు కూటమి నేతలు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం కనిపించింది. పలువురు కార్పొరేటర్లు వైసీపీని వీడి వచ్చేసేందుకు సిద్ధంగా ఉన్నారంటూ వార్తల వస్తున్న నేపథ్యంలో మేయర్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చర్చగా మారింది. వైసీపీకి చెందిన స్థానిక కార్పొరేటర్ కూడా పాల్గొన్నారు. కాగా ప్రొటోకాల్ ప్రకారమే మేయర్‌ను ఆహ్వానించామని, ఆమె కూడా హాజరయ్యారని అధికారులు చెబుతుండగా, రాజకీయ నాయకులు మాత్రం నవ్వుతూ మాట దాట వేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆరణికి శాలువాతో సత్కారం



ఐదుగురు మైనర్లకు పోలీసుల కౌన్సెలింగ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద సోమవారం సాయంత్రం అవిలాలకు చెందిన కొందరు యువకులు ఘర్షణకు దిగారు. కొట్లాటలకు దిగిన ఐదుగురిపై సీఐ మురళీమోహన్ రావు కేసు నమోదు చేశారు. అవిలాలకు చెందిన కొందరు యువకులు ఇన్‌స్టాగ్రామ్ విషయంలో కొట్లాటకు దిగారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరందరూ మైనర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

భక్తులు సంతృప్తి చెందేలా సేవలు

అధికారులతో ఈవో శ్యామలరావు





లడ్డూ విక్రయాల వద్ద పరిశీలిస్తున్న ఈవో - అన్నదానంలో నాణ్యతను పరిశీలిస్తున్న శ్యామలరావు

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు సంతృప్తికర సేవలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. గోకులం విశ్రాంతి భవనంలో సోమవారం ఆయన జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ నరసింహకిషోర్,వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. దర్శనం, వసతి, నాణ్యమైన అన్నప్రసాదాలు, పరిశుభ్రత, సౌకర్యాల విషయంలో సక్రమమైన సేవలందించడం మనందరి బాధ్యత అన్నారు. ఆదివారం తనిఖీల్లో భక్తుల అభిప్రాయాలు, అంచనాలను చేరుకోవడానికి ఇంకా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ప్రతి విభాగంలో చెక్‌లిస్ట్, టైమ్‌లైన్, ఫీడ్‌బ్యాక్ యంత్రాంగం ఏర్పాటు చేయాలన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లను సిద్ధం చేయాలని జేఈవోను ఆదేశించారు. దర్శనం, ఆన్‌లైన్ కోటా విడుదల, సేవా టికెట్లు, రిసెప్షన్ విభాగంలో వసతి విధానాలు, ఇంజినీరింగ్ పనులపై సంబంధిత అధికారులతో ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు.

రెండవరోజూ ఈవో తనిఖీలు

ఈవో శ్యామలరావు అధికారులతో కలిసి ముళ్లకుంట ప్రాంతంలోని కాటేజీలు పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. లడ్డూకౌంటర్, బూందీ తయారీ కేంద్రాల్లోనూ తనిఖీ చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: ఈవో

తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్ణయించిన దానికంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో శ్యామలరావు హెచ్చరించారు. శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు మార్గంలో కొంతమంది భక్తులు ఈవోకు ఫిర్యాదులు చేశారు. ఈవో ఆదేశాల మేరకు జేఈవో గౌతమి పర్యవేక్షణలో టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి శ్రీవారిమెట్టు వద్ద మూడు షాపులను తనిఖీ చేశారు. ఇందులో 3వ నెంబరు షాపులో వస్తువులను అధిక ధరకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. తిరుమల, తిరుపతిలో ఎక్కడైనా భక్తులకు టీటీడీ నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. 3వ నెంబరుగల షాపు యజమాని వినోద్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసి రూ.25 వేల జరిమానా విధిస్తామని టీటీడీ తెలిపింది.

తిరుపతి రోడ్లపై ఆక్రమణల తొలగింపు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: తిరుపతిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పలు రోడ్లు, ప్లాట్‌ఫారాలు ఆక్రమణలకు గురవ్వడంతో కిలోమీటరు ప్రయాణానికి గంట వ్యవధి పడుతోంది. ఈనేపథ్యంలో ఇటీవల ఎస్పీ హర్షవర్ధన రాజు ట్రాఫిక్ ప్రక్షాళనకు ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలోసోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది టీకే స్ట్రీట్, చిన్నబజారు వీధి, పూలమార్కెట్ రోడ్డు, గాంధీరోడ్డు, కర్నాల వీధి రోడ్లలో పర్యటించారు. వన్‌వేలలో వాహనాల రాకపోకలను నియంత్రించారు. పూల మార్కెట్ రోడ్డులో బ్యారికేడ్లు పెట్టి ఆక్రమణలను తొలగించారు. చిన్న బజారు వీధి, తీర్థకట్ట వీధి, కర్నాల వీధుల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. గాంధీ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా వివిధ ఆక్రమణలను తొలగించారు. కొందరు అడ్డుపడడంతో డీఎస్పీ కల్పించుకున్నారు. ఆటోల నియంత్రణకు కూడా చర్యలు చేపట్టారు. వన్‌వే వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించారు. చిన్నబజారు వీధిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న వివిధ రకాల వ్యాపారాలను కూడా తొలగించారు.



రోడ్డుపై ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

ఈద్గా స్థల వివాదాన్ని పరిష్కరిస్తా

బక్రీద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే హామీ

తిరుపతి, జూన్17(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ సమీపంలోని ఈద్గా మైదానంలో బక్రీద్ సందర్భంగా సోమవారం ముస్లింల ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇతర ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసూయ, ద్వేషం వీడి త్యాగ నిరతిని ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు. త్యాగ గుణం తోపాటు దాన గుణాన్ని చాటే బక్రీద్ సారాంశాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఎన్నికల్లోనే రాజకీయాలని, తరువాత అభివృద్ధిపై దృష్టి నిలిపామన్నారు. ముస్లింల సమస్యలను పరిష్కరిస్తానని ఆరణి చెప్పారు. ఈద్గా స్థల వివాదాన్ని పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని మాట ఇచ్చారు. టీడీపీ నేతలు నరసింహ యాదవ్, మహబూబ్ బాషా, అలీ ఖాన్, షేక్ అర్షద్, రఫీ, హరూన్, ఖాజా మోహిద్దీన్, ముస్లిం జేఏసి చైర్మన్ ముర్తాజ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.



బక్రీద్ వేడుకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తెలుగుపై అభిరుచిని పెంచుదాం



ప్రసంగిస్తున్న నాదెళ్ల శ్రీమన్నారాయణ

తిరుపతి (కల్చరల్), జూన్ 17: విద్యార్థుల్లో తెలుగు భాషపట్ల అభిమానం పెంచేలా బోధనా విధానం ఉండాలని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. సోమవారం ఉదయం తిరుపతి లోని ప్రైవేట్ పాఠశాలలో జిల్లా తెలుగు ఉపాధ్యాయుల బృందం పదవ తరగతి పాఠ్య ప్రణాళిక, కొత్త పాఠ్య పుస్తకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు భాస్కరరాజు, నాదెళ్ల శ్రీమన్నారాయణలు ప్రసంగించారు. విషయ నిపుణులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, గోవిందయ్య, యువశ్రీమురళి, పదవ తరగతి పాఠ్య పుస్తకం, పాఠ్య ప్రణాళిక, దినచర్య, పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పలువురు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు చర్యలు చేపట్టాలి



తిరుపతి(విద్య), జూన్ 17: ఏపీలో సీపీఎస్ రద్దు కోసం కేంద్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి కోరారు. అయోధ్యలో నిర్వహించిన అఖిల భారతీయ రాష్ట్రీయ శిక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) జాతీయ సమావేశాలకు ఏపీ నుంచి ఆపస్ పక్షాన సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సంఘటనా కార్యదర్శి హాజరైనట్లు ప్రకటించారు. సమావేశాల్లో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై సవివరంగా చర్చించారన్నారు. 2003-డీఎస్సీ టీచర్లకు పాతపెన్షన్ అమలుకు కృషి చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు ఉన్న ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఆపస్ ప్రధానకార్యదర్శి జీవీ సత్యనారాయణ, సంఘటనా కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్, ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహకార్యదర్శి ఎం.రాజశేఖర్‌రావు,ఏబీఆర్ఎస్ఎం ఉన్నతవిభాగ రాష్ట్రఅధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రధానకార్యదర్శి డాక్టర్ గంగినేని రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సప్తగిరి సంగీత సప్తాహం

తిరుపతి (కల్చరల్), జూన్ 17: వేమన విజ్ఞాన కేంద్రంలో పాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరు వీనులకు విందుగా సాగుతోంది. వారం రోజులు నిర్వహించే సంగీతయజ్ఞంలో భాగంగా సోమవారం భగవంతుని నామసంకీర్తనతో వేదిక మారుమోగింది. రోజంతా నిర్విరామంగా జరిగిన కార్యక్రమం త్యాగరాయ కీర్తనల గోష్ఠిగానంతో మొదలైంది. ప్రముఖ కళాకారులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ నామ సంకీర్తనలు, హిందూస్థాని బాణీలో సత్యసాయి భజనలు, నృత్య సహిత సంప్రదాయ సంకీర్తనా ప్రదర్శనలు అలరించాయి. సంగీత కళాకారులు డాక్టర్ జొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్, జొన్నలగడ్డ శ్రీరాం బృందం (హైదరాబాదు), ఆచంట లక్ష్మీశ్రీనివాస్ బృందం (రాజానగరం), ఎం. పురుషోత్తం బృందం(సూళ్లూరుపేటకు), నిడదవోలు నారాయణమూర్తి బృంద(రాజమండ్రి), జ్ఞానసురభి బృందం (చెన్నై), కె. లీలా రామానుజన్ బృందం (చెన్నై) తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు హరికథా గానం జరుగుతుందని నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.



ఆరోగ్యాంధ్ర కావాలని ప్రార్థించా

● మంత్రి సత్యకుమార్ యాదవ్



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆకాంక్షిస్తూ శ్రీవారిని ప్రార్థించానని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వికసిత్ భారత్ నిర్మాణానికి కావాల్సిన శక్తిసామర్థ్యాలను దేశ ప్రధానికి, సీఎం చంద్రబాబుకు ప్రసాదించాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. అభివృద్ధికి చిరునామాగా ఉన్న ఏపీ మళ్లీ పురోగమించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.

కబ్జాల కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోండి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 17: 29వ డివిజన్ కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు భూకబ్జాల కార్పొరేటర్‌గా అవతరించారని అదే ప్రాంతపు టీడీపీ నాయకుడు శరత్‌రాయల్ ఆరోపించారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పీఏనని చెప్పుకుంటూ వెంకటేశ్వరు నగరంలో పలు చోట్ల కబ్జాలకు పాల్పడ్డారన్నారు. మంచినీళ్లగుంట ప్రాంతంలోని బలిజ భవన్‌లోని 120 అంకణాల స్థలాన్ని ఆక్రమించా 50 అంకణాల్లో దర్జాగా ఇంటి నిర్మాణం చేపట్టాడన్నారు. అధికారులు పరిశీలించి ఈ స్థలాన్ని తిరిగి బలిజ భవన్‌కు కేటాయించి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయనగర్‌లో, 23వ డివిజన్ బాలాజీకాలనీ, తదితర ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకున్నారన్నారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శరత్ కోరారు.

బస్టాండులో బ్లేడు బ్యాచ్

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 17: తిరుపతి బస్టాండులో కొంత కాలంగా బ్లేడు బ్యాచ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. రాత్రి 10 గంటల తర్వాత గంజాయి తాగడం, ముఠాలుగా ఏర్పడి ముష్టి యుద్ధాలకు దిగడం పరిపాటిగా మారిందని ఆర్టీసీ కంట్రోలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోకపోవడం, పోలీసు యంత్రాంగం ఇతర విధుల్లో నిమగ్నం కావడంతో బస్టాండు ప్రాంగణం గంజాయి, బ్లేడు బ్యాచ్‌లకు షెల్టర్ జోన్లుగా మారిపోయాయి. ప్రయాణికుల ముసుగులో కూర్చుని గంజాయి తాగుతున్నారని కంట్రోలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పీలేరు, రాయచోటి ప్లాట్‌ఫారాల వద్ద కొందరు యువకులు గంజాయి మత్తులో గొడవలకు దిగడంతో ప్రయాణికులు భయభ్రాంతులయ్యారు. మందుబాబులతో కూడా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు..

కాలినడకన తిరుమలకు దర్శకుడు త్రివిక్రమ్



తిరుమల, జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు, మాటల రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్ సోమవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. సాయంత్రం శ్రీవారిమెట్టు నుంచి తిరుమలకు చేరుకున్నారు. త్రివిక్రమ్‌ను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

మంత్రికి ఉద్యోగ సంఘ నేతల అభినందనలు

తిరుపతి(వైద్యం), జూన్ 17 : వైద్య ఆరోగ్యశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సోమవారం రుయాస్పత్రికి వచ్చిన సత్యకుమార్‌కు ఉద్యోగ సంఘాల నేతలు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఏపీఎన్జీవో సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు మంత్రిని కలిశారు. రుయాస్పత్రిలో సిబ్బంది కొరతతో ఉద్యోగులపై పనిభారం పెరిగిందని, వైద్య ఆరోగ్యశాఖలోని ఖాళీలను భర్తీ చేస్తే రోగులకు చక్కటి వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని వారు ఆయనకు వివరించారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని నమ్మించి నర్సింగ్ సిబ్బందిని మోసం చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం నర్సింగ్ సిబ్బంది రెగ్యులర్ విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఏపీ హంస జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా యూనియన్ నేతలతో కలిసి మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగ సంఘ నేతలు చిట్టిబాబు, నరేష్, భాస్కర్‌రెడ్డి, టాటాబాయి, గీతా, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాలువా కప్పినంత మాత్రాన పార్టీలో చేర్చుకున్నట్టుకాదు: ఎమ్మెల్యే కురుగొండ్ల


కురుగొండ్లకు సత్కరిస్తున్న వైసీపీ నాయకుడు

డక్కిలి, జూన్ 17: ఎన్నికలకు ఒక్కరోజు ముందు వచ్చి పార్టీకి పనిచేసిన వారే తన వారని ఎన్నికల తర్వాత వచ్చి గుంపులో చేరి శాలువా కప్పినంత మాత్రాన వారిని పార్టీలో చేర్చుకున్నట్టు కాదని అలాంటి వారు దీన్ని గ్రహించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పెంచలకోన పర్యటనకు వచ్చిన ఆయకు టీడీపీ నాయకులతో పాటు కొంత మంది వైసీపీ నాయకులు కూడా శాలువాలతో సత్కరించారు. దీంతో స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నాయకులను పార్టీలో చేర్చుకునేది లేదని తేగేసి చెప్పారు. పార్టీని నమ్ముకొని ఉన్న నాయకులకు, కార్యకర్తలకు తాను అన్ని విధాలా అండగా వుంటానని చెప్పారు. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని అది ఎట్టి పరిస్థితుల్లో జరగదన్నారు. కాగా సోమవారం వైసీపీకి చెందిన డక్కిలి మండలం లింగసముద్రం సొసైటీ అద్యక్షులు వేముల రాజమోహన్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోటి ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పడంతో ఆయన పై విధంగా వ్యాఖ్యానించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఉన్నంతలో కొంత దానం చేయండి

బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో నెలవల పిలుపు


జామియా మసీదులో నెలవలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఫి తదితరులు

నాయుడుపేట, జూన్ 17: అల్లా మనకు ఇచ్చిన దానిలో కొంత లేనివారికి దానం చేయడం ద్వారా ఆ కుటుంబం సుఖసంతోషాలతో ఉండగలుగుతుందని సూళ్లూరుపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫి, నెలవల రాజేష్, పార్థసారధి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఇక బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జామియా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. జామియా మసీదు, నూర్‌మసీద్, మక్కా మసీదుల్లో, అమీర్‌షావలి దర్గాలో ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా హాజీలు మాట్లాడుతూ... బక్రీద్ పర్వదినం త్యాగానికి ప్రతీక అని ప్రతి ఒక్కరు పరస్పరం సాయం చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి దళ అర్చన



సూళ్లూరుపేట, జూన్ 17: పట్టణంలోని మద్వేంకటరామ్మూర్తి స్వామి ఆలయంలో జ్యేష్ఠ ఏకాదశి సందర్భంగా సోమవారం స్వామివారికి లక్ష తులసి దళ అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ లక్ష తులసి దళ అర్చన వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు అనంతకుమార్ పాల్గొనగా ట్రస్టు నిర్వాహకుడు బి.రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పవన్‌కల్యాణ్ గెలవడంతో తిరుమలకు పాదయాత్ర

గూడూరు అర్బన్, జూన్ 17: సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం కావడంతో ఆయన అభిమాని, జనసేన కార్యకర్త తిరుమలకు పాదయాత్ర చేపట్టాడు. పవన్ గెలిచి కూటమి అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వచ్చి శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపాడు. సోమవారం స్థానిక కోదండరామాంజ నేయస్వామి ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించి తరలివెళ్లాడు.

సరస్వతి శిశు మందిరంలో నాణ్యమైన విద్యాబోధన

గూడూరు అర్బన్, జూన్ 17: పట్టణంలోని పూలతోటలో ఉన్న సరస్వతి శిశుమందిరం పాఠశాలలో నామమాత్రపు ఫీజులతో, నాణ్యమైన, విలువలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నారని డాక్టర్ జనార్దన రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యాబోధన ఉంటుందన్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మయూరి శ్యాంయాదవ్, ప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బారావు, ఎస్‌ఎల్‌ఎన్‌స్వామి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కృష్ణ, రామ్మోహన్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న సెర్ప్ ప్రతినిధులు

కోట, జూన్ 17: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం సెర్ప్ ప్రతినిధులు ఆడిట్ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు వెలుగు కార్యాలయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సెర్ప్ ప్రతినిధు లైన నరసింహరావు, వీరేంద్ర నాథ్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి పలు సంఘాలకు సంబంధించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, ప్రసాద్, భాస్కర్, శంకరయ్య, కృష్ణమ్మ, బిందు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల అసోసియేషన్ ఎన్నికలు


నూతన కార్యవర్గ అభినందన సభ

కోట, జూన్ 17: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పర్సన్ విత్ డిజేబుల్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం, మురళీగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కోట మండల అధ్యక్షుడిగా జి.కృష్ణ, ఉపాధ్యక్షుడిగా వి.సుధీర్, మహిళా అధ్యక్షురాలిగా చల్లమ్మ, కార్యదర్శిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా శ్రీనివాసులు, జాయింట్ కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులచేత పీడబ్ల్యూడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు.

కూటమితోనే అభివృద్ధి


వివరాలు వెల్లడిస్తున్న వరప్రసాద రావు

వాకాడు, జూన్ 17: కూటమితోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని కొండూరుపాళెం నుంచి కూటమి నాయకులతో కలసి సుముద్రంలోని ముఖద్వారాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్ణముఖి అతిథిగృహంలో ఆయన మాట్లాడుతూ... వాకాడు మండలంలో మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలసి కల్పిస్తామన్నారు. ఇప్పటికే పూడిరాయదొరువు వద్ద సముద్ర ముఖ ద్వారానికి అనుమతులు వచ్చాయన్నారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం, శ్రీనివాససత్రం తదితర గ్రామాల్లో ఉన్న మత్స్యకారుల అభివృద్ధి కోసం కొండూరుపాళెంలో సహజసిద్ధంగా ఉన్న రెండో ముఖద్వారాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తీరప్రాంత గ్రామాల్లో అటవీ ఆంక్షలతో ఆగిపోయిన పనులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. డి. మధుసూదన్‌రెడ్డి, నన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, చిట్టమూరు మాజీ జడ్పీటీసీ వంకా రమణయ్య, బీజేపీ కౌన్సిల్ సభ్యులు పి.కృష్ణయ్య, రవినాయుడు, కె.సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెంబేడు రిజర్వాయర్ కల నెరవేరేనా?

ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటని నిర్మాణం ● సీఎం చంద్రబాబుపైనే రైతుల ఆశలు

పెళ్లకూరు, జూన్ 17: మండలంలోని 15 గ్రామాలకు తాగు, సాగునీటిని అందించడానికి నిర్దేశించిన చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణం కలగానే మిగిలింది. ఏళ్ల తరబడి ప్రతిపాదన దశ దాటని సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నీరు - చెట్టు పథకం పలు పంట కాలువలను, సప్లై ఛానళ్లను, చెరువులను అభివృద్ధి చేసింది. అయితే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయలేదు.

పెళ్లకూరు మండలంలోని 74 చిన్నా, పెద్దా చెరువుల్లో తలమానికం చెంబేడు చెరువు. సుమారు 832.90 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు నుంచి నందిమాల, చెన్నప్పనాయుడుపేట, ఆబాకవారికండ్రిగ, నల్లగుంట కండ్రిగ, అర్ధమాల, ఉమ్మలగుంట, వడ్డిపాలెం, మారినేనిపాలెం, అర్లపాడు పరిధిలో సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు, 20వేల మందికి నీరు అందుతోంది. ఈక్రమంలో 2014లో టీడీపీ అధికారం చేపట్టగా చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు కాలేదు.

జగన్ పాదయాత్ర హామీ తూచ్...

ఈ క్రమంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్... 2018 జనవరి 23న మండలంలో పాదయాత్ర నిర్వహించారు. ఆ సమయంలో నాయకులుతో పాటు రైతులు చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాల్సిందిగా జగన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారుస్తామంటూ హామీ ఇచ్చారు. ఆ తరువాత 2021లో రూ.31 కోట్లతో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలు బుట్ట దాఖలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గంలో ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణకు మంత్రులుగా స్థానం దక్కడం.. మంత్రులతో మండల టీడీపీ నేతలకు సత్సంబంధాలు ఉండడంతో పనుల్లో కదలిక రావచ్చని గ్రామీణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్వర్ణముఖినది ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ... 2014లో చెంబేడు రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, అనివార్య కారణాలతో నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రిజర్వాయర్‌గా మార్చి 15 గ్రామాల పొలాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ... చెంబేడు చెరువు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఈ ప్రాంత ప్రజలను ఆదుకుంటామన్నారు.


చెంబేడు చెరువు

నృసింహుడి కటాక్షంతోనే రాజకీయంగా ఎదిగా

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి


దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

డక్కిలి, జూన్ 17 : చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నృసింహస్వామి కటాక్షంతోనే తమ కుటుంబానికి రాజకీయంగా నాలుగు దశాబ్దాలపాటు అనేక పదవులు వరించాయని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న నృసింహస్వామిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఏసీ సాగర్ బాబు ప్రభుత్వ లాంఛనాలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్ల సేవలో పాల్గొనగా అర్చకులు గోత్రనామాలతో పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ... స్వామిఅమ్మవార్లను వేడుకుంటే వారి ఆశీస్సులతో అనుకున్న కోర్కెలు నెరవేరుతాయని చెప్పడానికి తన జీవితమే నిదర్శనమన్నారు. చంద్రబాబు లాంటి పెద్దల సాంగత్యం, సహచర ఎమ్మెల్యేల పరిచయాలతోనే తాను మళ్లీ మంత్రిగా ఇక్కడికి వచ్చానన్నారు. స్వామిఅమ్మవార్ల పూజలకే అంకితమయ్యే దేవదాయ శాఖ ద్వారా సమాజంలో అనేక వర్గాల ప్రజలకు ఊరట కలిగించడమే తన కర్తవ్యమన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు ఆయనతో పాటు రాజకీయాల్లో అడుగుపెట్టిన తాను ఆ స్ఫూర్తితో దేవదేవుడి ఆశీస్సులతో రాజకీయంగా ఇంతటి స్థాయికి చేరుకున్నానన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో త్వరలో శాసనసభ సమావేశాలు ముగిశాక అధికారికంగా నియోజకవర్గంలో పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. తన సోదరుడు కురుగొండ్ల రామకృష్ణతో తాను ఈ నియోజకవర్గంలో కలిసి మెలిసి పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్ను భాస్కరరెడ్డి, డి.వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురామిరెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి, పి.చంద్రమౌళిరెడ్డి, ఏఎంఎన్, రంగినేని రాజా, సోమయ్య, బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం

రెండు నెలల కాపురం తర్వాత పరార్ ● తెలంగాణ యువకుడిపై యువతి ఫిర్యాదు

గద్వాల క్రైం, జూన్ 17: ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ప్రేమకు, ఆపై సహ జీవనానికి దారితీసింది. రెండు నెలలు కాపురం చేశాక మళ్లీ వస్తానంటూ వెళ్లిన ఆ యువకుడు తిరిగి రానేలేదు. అతడిని వెతుక్కుంటూ తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడుకు వెళ్లిన విద్యానగర్ యువతి ఉదంతమిది. సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఆమె అందజేసిన ఫిర్యాదు మేరకు వివరాలివీ. కోట మండలం, విద్యానగర్‌కు చెందిన నిహారికకు మానవపాడు మండలం ఎ.బూర్దిపాడుకు చెందిన బషీర్ అనే యువకుడితో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి కొద్దిరోజులు ఇద్దరూ సహజీవనం చేశారు. తనకు ఇంతకుముందే వివాహమై విడాకులయ్యాయని, ఇద్దరు సంతానం అని చెప్పినా కూడా బషీర్ ఎలాంటి ఇబ్బంది లేదన్నాడని నిహారిక తెలిపింది. ఈ ఏడాది మార్చి 18న ఆయన హిందూ సంప్రదాయం ప్రకారం తాళి కట్టాడు. కొద్దిరోజులు ఇద్దరూ కాపురం చేశారు. తర్వాత తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని అన్న మౌలాలీ ఫోన్ చేశాడని, వెళ్లి చూసి వస్తానని బషీర్ సొంతూరికి వెళ్లాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో చివరకు నిహారిక తన భర్త ఊరికి వచ్చి గత నెల 25న శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఎస్‌ఐ సంతోష్ అసభ్యకరంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమెను స్టేషన్‌లోనే ఉంచి భయభ్రాంతులకు గురిచేశాడు. సోమవారం బక్రీద్ పండుగ కనుక భర్త ఇంటికి వస్తాడని భావించి బూడిదపాడుకు చేరుకున్న నిహారికను బషీర్ అసభ్యకరంగా దూషిస్తూ దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎస్‌ఐకి వివరించగా పట్టించుకోలేదు. దీంతో ఎస్‌ఐ సంతోష్‌పై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని డీఎస్పీ సత్యనారాయణకు సోమవారం నిహారిక ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ సంతోష్‌ను వివరణ కోరగా నిహారిక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేననీ, అయితే కేసు వద్దంటోందన్నారు. ఇద్దరినీ కూర్చోబెట్టి రాజీచేయాలని, లేదా పరిహారం ఇప్పించేలా చూడాలని చెపుతుండడంతో అది తమ డ్యూటీ కాదని పోలీస్‌స్టేషన్ బయట చూసుకోవాలని చెప్పినట్లు చెప్పారు. ఫిర్యాదు చేస్తే విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

రెండుపూటలా నీరు సరఫరా చేస్తాం: పాశం


మల్లితోట వాటర్‌వర్క్స్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, జూన్ 17: పట్టణ ప్రజలకు రెండుపూటలా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణానికి తాగునీరందించే వేములపాళెం, విందూరు, మల్లితోట వాటర్ వర్క్స్‌ను, జనార్దన రెడ్డి కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం పట్టణానికి కండలేరు జలాశయం నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందుతుండడంతో ఉదయం పూట మాత్రమే సరఫరా అవుతోందన్నారు. గతంలో విందూరు వాటర్‌వర్క్స్ నుంచి తాగునీరు సరఫరా అయ్యేదన్నారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మోటర్లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. అలాగే అక్కడ ఆక్రమణలను తొలగించి వాటర్‌వర్క్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. పట్టణంలో పలు ఓవర్ హెడ్ ట్యాంకులు కూడా పగుళ్లిచ్చి ఉన్నాయని వాటికీ మరమ్మతులు చేపడతామన్నారు. అనంతరం టిడ్కో గృహాలను పరిశీలించి నివాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహ సముదాయానికి వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ రంగులేసిందే తప్ప మౌలిక వసతులు కల్పించలేదన్నారు. తన సొంత నిధులతోనైనా బోర్లు వేయించి నీటి సౌకర్యం కల్పిస్తానన్నారు. ఎస్.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, బి.చెంచురామయ్య, ఏ.మస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్




గూడూరు నమాజ్‌కట్ట వద్ద ముస్లింల ప్రార్థనలు - ముస్లిం మహిళకు మాంసం ప్యాకెట్ అందిస్తున్న గ్రీన్ ఫౌండేషన్ సభ్యులు

గూడూరు/ వెంకటగిరి టౌన్/ బాలాయపల్లి/ వాకాడు/ కోట, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినం నిలుస్తుందని ముస్లిం మత పెద్దలు అన్నారు. గూడూరుపట్టణం సహా చెన్నూరు, విందూరు గ్రామాల్లో నమాజ్‌కట్ట వద్ద, జామియా మసీదు వద్ద, పలు ప్రాంతాలలోని దర్గాల వద్ద ముసింలు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. వెంకటగిరి పట్టణంలోని జామియా మసీదు, అక్స మసీదు, రహణీ మసీదు, ఉమ్మర్ మసీదు, బిల్లాల్ మసీదుల్లో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలాయపల్లి మండలంలోని గొట్టికాడు, జయంపు, మన్నూరు, పల్లిపాడు, ఊట్లపల్లి, నిడిగల్లు ఇంకా పలు గ్రామాల్లోని ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. వాకాడు పట్టణంలోని జామియా మసీదులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు బక్రీద్ విశిష్టతను బోధించారు. కోట మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు బక్రీద్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని రవినగర్‌లో గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు మాంసం తదితరాలను సంస్థ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అందజేశారు. అదే విధంగా శ్యామసుందరపురం ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దొరవారిసత్రం మండలంలో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అలరించిన సప్తగిరి సంగీత సప్తాహం



తిరుపతి (కల్చరల్) జూన్ 17: వేమన విజ్ఞాన కేంద్రంలో పాస్ మనో వికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరు వీనులకు విందుగా సాగుతోంది. వారం రోజులు నిర్వహించే సంగీతయజ్ఞంలో భాగంగా సోమవారం భగవంతుని నామసంకీర్తనతో వేదిక మారుమోగింది. రోజంతా నిర్విరామంగా జరిగిన కార్యక్రమం త్యాగరాయ కీర్తనల గోష్ఠిగానంతో మొదలైంది. ప్రముఖ కళాకారులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ నామ సంకీర్తనలు, హిందూస్థాని బాణీలో సత్యసాయి భజనలు, నృత్య సహిత సంప్రదాయ సంకీర్తనా ప్రదర్శనలు అలరించాయి. సంగీత కళాకారులు డాక్టర్ జొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్, జొన్నలగడ్డ శ్రీరాం బృందం (హైదరాబాదు), ఆచంట లక్ష్మీశ్రీనివాస్ బృందం (రాజానగరం), ఎం. పురుషోత్తం బృందం(సూళ్లూరుపేటకు), నిడదవోలు నారాయణ మూర్తి బృంద(రాజమండ్రి), జ్ఞానసురభి బృందం (చెన్నై), కె. లీలా రామానుజన్ బృందం (చెన్నై) తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు హరికథా గానం జరుగుతుందని నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


గరుడ పటానికి పూజలు చేస్తున్న అర్చకులు

గూడూరు, జూన్ 17: స్థానిక రాజావీధిలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17న సోమవారం స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి గరుడ పటాన్ని ఎగుర వేసి ఉత్సవాలకు నాంది పలికారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



నాయుడుపేట టౌన్, జూన్ 17: విజ్ఞానం లేని చదువు పనికిరాదని... విలు వలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరు అభ్యసించాలని త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ అన్నారు. పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న అమరనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం చిన్నజీయర్‌స్వామి భక్తులను అభిభాషణ చేశారు. మానవసేవే మాధవసేవ అన్న విధంగా ప్రతి జీవికి చేతనైన సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామసుందర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, కట్టా సురేఖారెడ్డి, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి వర్షం

వెంకటగిరిటౌన్, జూన్ 17: గత మూడు రోజులు భానుడు ప్రతాపం చూపించాడు. సోమవారం మధ్యాహ్నం నుంచి పట్టణంలో తేలికపాటి వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. ఆరుతడి పంటకు నీరు లేకపోవడంతో ఈ వర్షంతో రైతులు ఊరట చెందారు.

మంత్రి ఆనంకు పేట నాయకుల సన్మానం



నాయుడుపేట, జూన్ 17: దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని సోమవారం తిరుపతి పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దార్ల రాజేంద్ర సన్మానించారు. రాష్ట్రంలోని పురాతన దేవా లయాలను వెలుగులోకి తీసుకురాడమే కాకుండా పునరుద్ధరించాలని కోరారు. అయ్యప్ప, పవన్‌కుమార్, సుకుమార్, వినోద్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి


హాకి స్టిక్, సర్టిఫికెట్లను అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, జూన్ 17: క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి పాశం సంధ్యారాణి అన్నారు. సోమవారం ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో తిరుపతికి చెందిన సాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాకీ వేసవి శిక్షణ ఉచిత శిబిరం ముగింపు సందర్భంగా హాకీ క్రీడాకారులకు స్టిక్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు దేశస్థాయిలో రాణించి గూడూరుకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కోచ్ దీపక్‌ఆకాష్, అబ్రహం, చంద్రనీల్, టీఆర్.మణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి ఘన సత్కారం



పెళ్లకూరు, జూన్ 17: ఎమ్మెల్యే విజయశ్రీని వెయ్యి 5 రూపాయల నాణేల మాలతో పేరం సోదరులు సత్కరించారు. సోమవారం నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతోపాటు ఎమ్మెల్యే విజయశ్రీని పూల మాలలు, శాలువాలతో పెళ్లకూరు టీడీపీ నాయకులు పేరం రమేష్‌నాయుడు మధుసూదన్‌నాయుడు, చంద్రబాబునాయుడు, ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి. మురళీకృష్ణారెడ్డి, కె.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగు గంగ కాలనీ అతిథి గృహంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షనర్స్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రేగంటి దేవానంద్, ప్రధాన కార్య దర్శిగా సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రెడ్డివాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మంజు, కార్యదర్శిగా భారతి, ఆర్థిక కార్య దర్శిగా ఇందిరను ఎన్నుకున్నారు. యువకిషోర్, ఎస్.బాషా, చెంగల్‌రాయులు, వెంకటయ్య, బాలచందర్, లక్ష్మీపతి, విశ్వనాథ్, సరిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 40వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 5.680మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,050మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 3,631మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,869, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 597మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 393మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 98మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,159 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ముక్కంటి సేవలో కన్నా లక్ష్మీనారాయణ



కన్నా లక్ష్మీనారాయణతో శాంతారాం పవార్ కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి, జూన్ 17: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, నాగభూషణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తన చిరకాల మిత్రుడు ముక్కంటి ఆలయ, పురపాలక సంఘ మాజీ చైర్మన్ శాంతారాం పవార్ ఇంటికి వెళ్లారు. వారి ఆతిథ్యం స్వీకరించారు. శాంతారాం పవార్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పీవీఆర్ గ్రూప్స్ డైరెక్టర్ జనార్దన్‌రావు పవార్, సిద్ధార్థ్ పవార్, జీవీ రమణ మూర్తి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిందేపల్లె రోడ్డు సమస్య పరిష్కరించండి



నగరం వినుతను సన్మానిస్తున్న చిందేపల్లె గ్రామస్తులు

ఏర్పేడు, జూన్ 17: ఏర్పేడు మండలం చిందేపల్లె రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆ గ్రామస్తులు సోమవారం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి నగరం వినుతను కోరారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గ్రామస్తులు ఆమెను కలిసి సన్మానించారు. చిందేపల్లె రోడ్డు సమస్య గురించి వివరించారు. 80 ఏళ్ల నుంచి చిందేపల్లె గ్రామానికి వెళుతున్న రోడ్డును మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి పరిశ్రమ యాజమన్యానికి కొమ్ము కాసి రోడ్డును అడ్డగించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో చిందేపల్లె గ్రామస్తులతో వినుత కలిసి నిరాహార దీక్ష చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసీఎల్ పరిశ్రమ యాజమాన్యంతో కలిసి ఎమ్మెల్యే కుట్రపూరితంగా గ్రామస్తుల మీద అక్రమ కేసులు బనాయించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన వినుత చిందేపల్లె రోడ్డు సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఏర్పేడు, జూన్ 17: ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో రోడ్డు పక్కన ఉన్న బస్సుషెల్టర్ వద్ద ఓ వృద్ధుడు మృతి చెందాడు. గత ఆరు నెలలుగా ఓ వ్యక్తి గ్రామంలో భిక్షాటన చేసేవాడు. రాత్రి పూట బస్సుషెల్టర్‌లో నిద్రిస్తుండేవాడు. సోమవారం ఉదయం మృతి చెంది ఉండ డంతో సర్పంచు గుణయాదవ్, టీడీపీ నేత సుబ్రహ్మణ్యం పోలీసులకు సమాచారం అందించారు. వారి అనుమతితో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మంత్రిని కలిసిన కోలా ఆనంద్



శ్రీకాళహస్తి, జూన్ 17: రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముక్కంటి శాలువాతో సత్క రించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మృత్యుంజయస్వామికి పూజలు



ప్రత్యేకాలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చంద నం, విభూధి, పచ్చక ర్పూ రంతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంక రించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.





ప్రభుత్వ స్థలంలో నిర్మించిన దుకాణాలు - వరవ కాలువ ఆక్రమించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

పల్లంపేటలో వైసీపీ నేతల భూదందా

ప్రభుత్వ స్థలంలో ఇష్టారాజ్యంగా దుకాణాల నిర్మాణం

ఏర్పేడు, జూన్ 17: ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేటలో భూదందా రాజ్యమేలుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారు. కొందరు ప్రభుత్వ స్థలాల్లో ఏకంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. సర్వే నెంబరు 125లో 50 సెంట్లు, సర్వే నంబరు 136లో మూడు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో 1.5 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. మిగిలిన మూడు ఎకరాల్లో కొబ్బరి చెట్లు నాటారు. దీనిపై విచారణ జరిపి అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులు, టీడీపీ నేతలు కలిసి విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదు. పల్లంపేటలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వైసీపీ నేతలు కౌంటింగ్‌కు వారం రోజుల ముందు పనులను పూర్తిచేశారు. దీనిపై కలెక్టర్, ఏర్పేడు తహసీల్దారు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుని అక్రమ కట్టడాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలతో దళిత, గిరిజన కాలనీలకు ముప్పు

పల్లంపేట వద్ద గంగలపూడి చెరువు, వేలవేడు చెరువుల్లోకి వెళుతున్న వరవకాలువ చుట్టూ ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించి భవనాలు, దుకాణాలు నిర్మించారు. దీంతో కాలువ ఇరుకుగా మారి వర్షాకాలంలో అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు పొంగి దళితవాడ, గిరిజనకాలనీల్లోకి ప్రవహించే ప్రమాదం ఉంది. 2016లో కురిసిన భారీ వర్షానికి ఈ కాలనీల్లోని ఇళ్లలోకి నీళ్లు రావడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. పాలకులు, అధికారులు స్పందించి వరవ కాలువ చుట్టూ వైసీపీ నేతలు చేపట్టిన అక్రమ కట్టడాలను తొలగించాలని పల్లంపేట దళితవాడ, గిరిజనకాలనీ ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు





శ్రీకాళహస్తిలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి - వరదయ్యపాళెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తి పట్టణంలో ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణంలోని ఈదులగుంట ఈద్గా, ప్రభుత్వాస్పత్రి సమీపంలోని ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు ఈద్గా కమిటీ, ముస్లిం మతపెద్దలు సాదరంగా ఆహ్వానించి సంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీద్ ముత్తవలి అక్రమ్‌బాయ్, అంజాద్‌బాషా, మైనార్టీ నాయకులు షాకీరాలీ, షఫి, జిలానీ, అస్మత్, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు/నాగలాపురం: సత్యవేడుతో పాటు దాసుకుప్పం, శిరుణంబూదూరు, ఏఎంపురం గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక మసీదులో ఇమాం పవిత్ర ఖురాన్ సూక్తులను పఠించి అల్లా శాంతిసందేశాలను వినిపించారు. అనంతరం ఖుర్బానీ కార్యక్రమాన్ని ఆచరించారు. ఎమ్మెల్యే ఆదిమూలం నియోజకవర్గ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ● నాగలాపురం, టీపీకోట గ్రామాల్లోని మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈదుల్ జుహా నమాజును చదివి, ఒకరికొకరు ఈద్ ముబారక్ (శుభాకాంక్షలు) తెలుపుకున్నారు.

రేణిగుంట: పట్టణంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులకు చేరుకున్న ముస్లింలు ముతవల్లీతో కలిసి ఈద్గా మైదానం వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ నాయకులు మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేశారు. కాగా, ఈద్గా మైదానం వద్ద పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

కేవీబీపురం: మండలంలోని రాగిగుంట, పెరిందేశం, అంజూరు, ఓళ్లూరు గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించి నూతన వస్త్రాలు ధరించి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానమాచరించి ఈద్గాలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. మండలంలోని గోవర్ధనపురం ఈద్గా మైదానం, ముస్లింపాళెం పంచాయతీ గౌసియానగర్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ, నీర్పాకోట, వెస్ట్ వరత్తూరు, గాజులపెళ్లూరు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

స్పైస్‌జెట్ సిబ్బందితో ప్రయాణికుల గొడవ

రేణిగుంట, జూన్ 17:తిరుపతి విమానాశ్రయంలో స్పైస్‌జెట్ సిబ్బందితో ప్రయాణికులు గొడవకు దిగారు. స్పైస్‌జెట్ విమానం రాత్రి 7.15గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని తిరిగి 8.05గంటలకు హైదరాబాద్ వెళుతుంది. సోమవారం ఈ విమానానికి 78 మంది ప్రయాణికులు రేణిగుంట నుంచి హైదరాబాద్‌కు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే రాత్రి 11.30 గంటలకు ఆలస్యంగా విమానం వస్తుందని ప్రయాణికులకు సోమవారం మధ్యాహ్నం సమాచారం ఇచ్చారు. దీంతో కొంతమంది ప్రయాణాన్ని రద్దు చేసుకోగా మరికొంతమంది ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. తిరిగి సాయంత్రం 4గంటలకు విమానం క్యాన్సిల్ అయిందంటూ సమాచారాన్ని మెసేజ్ రూపంలో పంపించారు. అయితే అప్పటికే విమానాశ్రయానికి చేరుకున్న ఆరుగురు ప్రయాణికులు స్పైస్‌జెట్ సిబ్బందితో గొడవకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఇంతలో కొంతమంది కలుగజేసుకుని సర్దిచెప్పడంతో ప్రయాణికులు తిట్టుకుంటూ వెనుదిరిగారు.

యువతి అదృశ్యం

ఏర్పేడు, జూన్ 17: ఏర్పేడు మండలం కాత్రకాయల గుంట గ్రామానికి చెందిన యువతి(16) అదృశ్యమైనట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కుమార్తె సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని, బంధువుల ఇళ్ల ఆరా తీసినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 17: తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి క్లస్టర్ ఇన్‌ఛార్జి శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో దళితులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగమనాయుడుపల్లి పంచాయతీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.టీడీపీ నాయకులు రావిళ్ల మునిరాజానాయుడు, గంధం శ్రీనివాసులు, ఉన్నం ఆనందనాయుడు, గంధం గురవయ్య, గంధం పొన్నారావు, చిన్నరంగయ్య, గంధం దశయ్య, కోగిల ఓసూరయ్య, కొప్పల రాఘవులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు, జూన్ 17: ఏర్పేడు మండలం వికృతమాల వద్ద స్వర్ణముఖి ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు

కేవీబీపురం, జూన్ 17: మండలంలోని ఎంఏ రాజులకండ్రిగ గిరిజనకాలనీకి వెళ్లే రోడ్డు మిచౌంగ్ తుఫాన్ సమయంలో కొట్టుకుపోయింది. అప్పటి నుంచి గిరిజనుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆర్‌కేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరశురాముడు సోమవారం రూ.25వేలు వెచ్చించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.





మృతి చెందిన మునస్వామి, తీవ్రంగా గాయపడిన సాదిక్

రెండు బైక్‌ల ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కేవీబీపురం, జూన్ 17: మండల కేంద్రమైన కేవీబీపురంలో సోమవారం రాత్రి 8గంటల సమయంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్ఐ లోకనాథం కథనం మేరకు... సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మునస్వామి(35) కేవీబీపురం మండలంలోని పెరిందేశం గ్రామం వద్ద ఉన్న ఆదిత్య పరిశ్రమలో సోలార్ సిస్టమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కేవీబీపురం మండలంలోని రాగిగుంట గ్రామంలో నివాసం ఉంటున్న అతను సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంలో పిచ్చాటూరు వైపు వెళుతుండగా కేవీబీపురం గ్రామానికి చెందిన సాదిక్(24) ద్విచక్ర వాహనంలో ఎదురుగా వస్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మునస్వామి ఘటనాస్థలంలోనే మరణించాడు. సాదిక్ తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అలాగే మునస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రెచ్చిపోయిన ఆటోడ్రైవర్

తల్లి, కొడుకుపై దాడి



గాయపడిన ప్రసాద్, జ్యోతి

శ్రీకాళహస్తి, జూన్ 17: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. దీనిపై బాధితులు ప్రశ్నించడంతో ఆటో డ్రైవర్ ఎదురుదాడికి దిగి రెచ్చిపోయిన ఘటన సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో చోటు చేసుకుంది. మండలంలోని ఊరందూరుకు చెందిన ప్రసాద్ ముక్కంటి ఆలయంలోని సెల్‌ఫోన్ కౌంటర్‌లో పనిచేస్తుంటారు. సొంత పనుల నిమిత్తం సోమవారం ప్రసాద్ ద్విచక్ర వాహనంపై తల్లి జ్యోతిని వెంటబెట్టుకుని పట్టణానికి వచ్చారు. రాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. పట్టణంలోని అమర జ్యోతి కల్యాణ మండపం వద్ద ద్విచక్ర వాహనం వెళుతుండగా పక్కనే వెళుతున్న ఆటో ద్విచక్ర వాహనాన్ని తాకింది. దీంతో తల్లి, కొడుకు అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. ఘటనా స్థలం నుంచి పారిపోతున్న ఆటోడ్రైవర్‌ను ప్రసాద్ అడ్డుకుని నిలదీశాడు. రెచ్చిపోయిన డ్రైవర్ నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే తల్లి, కొడుకుపై దాడి చేసి పరారయ్యాడు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించండి

నారాయణవనం, జూన్ 17: మండల పరిధిలో ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించిందేకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ డ్రాపౌట్స్, స్కూల్లో చేరని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడానికి చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పాలమంగళం ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు.

తేలికపాటి వర్షం

వెంకటగిరిటౌన్, జూన్ 17: గత మూడు రోజులు భానుడు ప్రతాపం చూపించాడు. సోమవారం మధ్యాహ్నం నుంచి పట్టణంలో తేలికపాటి వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

పుత్తూరు వార్తలు



ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

పుత్తూరు అర్బన్, జూన్ 17: బక్రీద్ పండుగ త్యాగనిరతికి ప్రతీకని ముస్లిం సోదరులు పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్‌జీవో కాలనీ వద్ద ఉన్న ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం కన్నప్రేమను సైతం బలిచ్చేందుకు సిద్ధపడిన అబ్రత్ ఇబ్రహీం త్యాగనిరతిని కీర్తిస్తూ చేసుకునే పండుగ బక్రీద్ అని చెప్పారు. అనంతరం ముస్లింలు అందరూ నమాజ్ చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ సాహెబ్, మౌసమ్ సాహెబ్, మజీద్ సాహెబ్, మహమ్మద్ నబీ, మహమ్మద్ రఫీ, షబ్బార్, హమీద్ బాషా, మహమ్మద్ గౌస్, చాను, శంసు, ఖాజాపీర్, కలీమ్, ఆలీషా, షకీల్, రఫీ అహమ్మద్, జమాల్ ఆలీషా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం





ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు - పెద్ద శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీహరి

వడమాలపేట, జూన్ 17: అప్పలాయ గుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్వజారోహనంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25 గంటల నడుమ మిథున లగ్నంలో వైఖానస ఆగమోక్తంగా కంకణ భట్టాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజా రోహణం చేశారు. ఉదయం మాడవీధుల్లో ధ్వజపటంతో శ్రీవారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ముక్కోటి దేవతలను బ్రహ్మోత్స వాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేశారు. అనంతరం ఉభయనాంచారులతో శ్రీవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ అనంతరం పెద్ద శేష వాహనంపై శ్రీనివాసుడిని అధిరోహింప జేసి సంపూర్ణ అలంకరణతో మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్ పాల్గొన్నారు.



శ్రీవారికి ఉయ్యాల బల్ల బహూకరణ

వడమాలపేట, జూన్ 17: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామికి తిరుపతికి చెందిన హేమంత్ ఉయ్యాల బల్ల బహూకరించారు. స్వామివారి ఊంజలసేవ, ఏకాంతసేవలో ఉపయోగించేందుకు నాలుగు కిలోల వెండితో చేసిన ఉయ్యాల బల్లను ఆలయ అధికారులకు సోమవారం అందజేశారు.